# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 6, మే 2026


# విద్యార్థులకు నైపుణ్యాత్మక విద్యను అందించాలి

**➺ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, మే 05, ప్రభాతవార్త**

బాసర ఐఐటీలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఐఐటీ క్యాంపస్‌ను సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా విద్యా బోధన ఉండాలని, ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సురక్షిత తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌లను వర్సిటీ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి గోవర్ధన్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పవన్ చంద్ర పాల్గొన్నారు.



# సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన పెంచాలి

**ఆసిఫాబాద్, మే 5, ప్రభాతవార్త**

సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన పెంచడంలో సైబర్ వారియర్స్ కీలక పాత్ర పోషించాలని ఎస్పీ నితికా పంత్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నియంత్రణపై సైబర్ వారియర్స్‌కు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలీస్ సైబర్ వారియర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబర్ నేరాల స్వరూపం, వాటిని ముందుగానే గుర్తించే విధానాలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ సైబర్ వారియర్స్‌కు సైబర్ టీషర్ట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ దివ్య, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.




# శాస్త్రీయ వ్యవసాయ సాగుతో అధిక దిగుబడి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 5, ప్రభాతవార్త**

వ్యవసాయ సాగులో శాస్త్రీయ విధానాలు అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో రైతు వారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉద్యాన పంటల, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత, మండల తహసిల్దార్ మల్లికార్జున్, చెన్నూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మలతో కలిసి హాజరై చెన్నూరు నియోజకవర్గ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులతో సమీక్ష సమావేశం మిగతా 2లో..

# ఆయిల్ ఫాం సాగుకు రైతులు ముందుకు రావాలి



**ఆసిఫాబాద్, మే 5, ప్రభాతవార్త**

ఆయిల్ ఫాం సాగు కోసం అర్హులైన రైతులు ముందుకు రావాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ఏర్పాటు చేసిన రైతు వారంపై ఆసిఫాబాద్ నియోజక వర్గ స్థాయి సమావేశానికి అదనపు కలెక్టర్ యం. డెవిడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్లు ఇరుకుల్ల మంగ, కుడ్మేత విశ్వనాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నదిం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ ఫాం సాగుకు మిగతా 2లో..

## కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా..

# విద్యార్థుల ప్రతిభకు జాతీయ ముద్ర

**❈ పార్కింగ్ సమస్యల పరిష్కారానికి వినూత్న డిజైన్‌కు పేటెంట్ హక్కులు**

**కాగజ్‌నగర్ రూరల్, మే 5, ప్రభాతవార్త**

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థుల ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రద్దీ ప్రదేశాలలో పార్కింగ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపించే ఖపార్కింగ్ మేనేజ్‌మెంట్ ఇన్ క్రౌడెడ్ ప్లేసెస్గగ అనే వినూత్న డిజైన్‌కు భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం అధికారికంగా నమోదు కల్పించింది. ఈ డిజైన్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ 486267-001 కాగా, 2026 జనవరి 5న నమోదు చేయబడింది. ఈ ప్రాజెక్ట్‌ను మోల్కారి కేశవ్,అల్సా మమత, కటుకం మధుకర్ కలిసి రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత ఆవిష్కరణకు సంబంధించిన విద్యార్థిని అల్సా మమతను, మార్గదర్శకత్వం అందించిన ఉపాధ్యాయుడు మోల్కారి కేశవ్‌ను, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లలిత పాల్గొన్నారు.



విద్యార్థిని అల్సా మమత మాట్లాడుతూ ఈ డిజైన్ ద్వారా నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు సమర్థవంతమైన సాంకేతిక పరిష్కారం అందించవచ్చని తెలిపారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం, సమయాన్ని ఆదా చేయడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ, జిల్లాలోని విద్యార్థులు, యువతకు ఈ ఆవిష్కరణ ఒక ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని తెలిపారు. అదేవిధంగా, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే అధికారులకు తక్షణ సమాచారం అందించే పరికరాలు అభివృద్ధి చేయాలని సూచించారు.

## శాస్త్రీయ వ్యవసాయ సాగుతో అధిక దిగుబడి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ సాగులో శాస్త్రీయ పద్ధతులను తబలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రైతులు ఒకే రకమైన పంట సాగు చేయడం కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి వ్యాపార, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని, ఒకే రకమైన పంట సాగు చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్లో రా రైస్ కు డిమాండ్ ఉందని తెలిపారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తుందని, ఈ క్రమంలో రైతులు సన్న రకం వడ్ల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని, తక్కువ సాగునీటిని వినియోగించి అధిక దిగుబడి పొందే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసి పంట మార్పిడి, సాగు విధానం, పంటల రకాలు ఇతర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ పంట సాగులో అవసరమైన మెలకువలు అందించడం జరుగుతుందని తెలిపారు. పంట సాగు సమయంలో అవసరం మేరకు మాత్రమే యూరియా, డిఎపి వినియోగించాలని, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన అధికారులు అందుబాటులో ఉంటారని, పంట సాగులో ఏమైనా అవసరమున్నట్లయితే అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన కిట్లను అందజేశారు.

అంతకుముందు చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, సంక్షేమ వసతి గృహం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని సోమనపల్లిలో తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫాం సాగుకు రైతులు ముందుకు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. సాగు నీరు సౌకర్యం కలిగిన రైతులు ఆయిల్ ఫాం సాగుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కుడా అందిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫాం సాగులో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా రైతులు అధిక లాబాలను ఆర్జించవచ్చన్నారు. ఈ పంటకు చీడ పురుగులు, పశువులు, కోతుల బెడద ఉండదని, సంప్రదాయ పంటలైన పత్తి, వరి కాకుండా ప్రత్యాన్మాయ పంటల సాగుపై ద్రుష్టి సారించాలన్నారు. కూరగాయల పంటలను సాగు చేసి అధిక లాభాలను అర్జించవచ్చన్నారు. ప్రస్తుతం ఇతర దేశాల నుండి వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్నామని అదే ఆయిల్ ఫాం సాగు పెరిగితే ఇక్కడే వంట నునేలు చౌకగా దొరుకుతాయన్నారు. ప్రతి ఒక్క రైతు తమ కుటుంబానికి సరిపడే పంటలను, కూరగాయలను పండించుకోవడం ద్వారా ఎలాంటి అనారోగ్య బారిన పడే అవకాశం ఉండదన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ పంటలను వేసి అందరికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సుదీర్ఘ సేవలకు గుర్తింపు..

### - పోస్టల్ ఉద్యోగి అంజన్నకు సన్మానం

**పెంచికల్‌పేట్, మే 5, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఎల్కపల్లి పోస్టల్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన పెద్ది అంజన్నను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో చూపిన నిబద్ధతను ప్రశంసిస్తూ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ప్రజలకు సేవలందించడంలో ఆయన పాత్ర విశేషమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, స్థానికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంజన్నకు సన్మానం

# ఆర్.కె 5 గనిలో పరికరాల కొరతను వెంటనే తీర్చాలి: ఏఐటీయూసీ నేతలు

**నస్పూర్, మే 5, ప్రభాతవార్త**



ఆర్.కె 5 గనిలో నెలకొన్న డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్ల కొరతను వెంటనే తీర్చి కార్మికులకు ఆటంకం లేకుండా చూడాలని ఏఐటీయూసీ నాయకత్వం డిమాండ్ చేసింది. మంగళవారం యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా ఆర్.కె 5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో క్షేత్రస్థాయిలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రూఫ్ బోల్టర్ మిషన్ పని ప్రదేశానికి చాలా దూరంగా ఉండటం వల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, దానిని పని ప్రదేశానికి సమీపంలోనే ఏర్పాటు చేయాలని కార్మికులు నాయకుల దృష్టికి తెచ్చారు. వీటితో పాటు తుంటలు, గుటకలు, హ్యాండ్ గ్లౌజ్లు, ప్యాకింగ్ చెక్కల కొరత వేధిస్తోందని వివరించారు. ఎస్‌డీఎల్ యంత్రాలకు లీడ్ ఎక్కువగా ఉండటం, 27వ లెవల్‌లో తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులు గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝాను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. స్పందించిన మేనేజర్, గనిలో ఎదురవుతున్న ఇబ్బందులపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి జి. నర్సింగరావు, సంఘ రాజయ్య, భోగ మధునయ్య, నాగుల రాజయ్య, శంకర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన

**చింతలమానేపల్లి, మే 05, ప్రభాతవార్త:**

మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో బుధవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కార్తీషా తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మంజూరు ప్రక్రియతో పాటు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) ద్వారా లభించే ప్రయోజనాలను వివరించనున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధానంపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మండల పరిధిలోని అందరు రైతులు పాల్గొనాలని అన్నారు.

## వ్యవసాయ రంగంలో సౌర శక్తి వినియోగాన్ని పెంచాలి

**ఆసిఫాబాద్, మే 5, ప్రభాతవార్త :**

వ్యవసాయ రంగంలో సౌర శక్తి వినియోగాన్ని పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెంపుతో పాటు విద్యుత్ ఖర్చుల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను సాధించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని విద్యుత్ శాఖ ఎస్ఈ జాడే ఉత్తమ్ మంగళవారం తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు – సౌర విద్యుత్ కేంద్రాలు అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు మండల స్థాయిలోని రైతు వేదికల్లో నిర్వహించబడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంఘాలు, ప్రజా ప్రతినిధులు విస్తృతంగా పాల్గొలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు హాజరై రైతులకు మార్గనిర్దేశం చేయనున్నారని స్పష్టం చేశారు. మండల, జిల్లా స్థాయిలో అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారని వివరించారు. రైతులకు సౌర విద్యుత్, పియం కుసుమ్ తదితర పథకాలపై సమాచార పుస్తకాలు పంపిణీ చేయబడతాయని, రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంకు పటిష్ట బద్రత

**ఆసిఫాబాద్, మే 5, ప్రభాతవార్త :**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బద్రపరిచిన గోదాం కు పటిష్ట బద్రత కల్పించడం జరుగుతుందని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బద్రపరిచిన గోదాం ను నెలవారి తనిచలో భాగంగా సందర్శించి సిసి కెమెరాల పనితీరు, గేటుకు వేసిన సిలును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాం వద్ద పటిష్ట బద్రత కల్పించడం తో పాటు 24 గంటల పాటు సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం సుపరిండేంట్ జమిల్, నాయబ్ తహసిల్దార్ శ్యాంలాల్, తదితరులు పాల్గొన్నారు.



## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్సీ దండే విఠల్‌ను కలిసిన జేఏసీ

### - కార్పొరేషన్ ఏర్పాటు - ఏజెన్సీ వ్యవస్థ రద్దు కోరుతూ వినతి

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**



జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుత ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమస్యల పత్రాన్ని ఎమ్మెల్సీ అందజేశారు. వివిధ శాఖలకు చెందిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ భద్రత, వేతనాల అసమానతలు, సేవా నియమాలలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలను వారు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ దండే విఠల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు జిల్లా మాత్రమే కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. రామచందర్, ప్రధాన కార్యదర్శి పోలోజు సంతోష్, కోశాధికారి సుఖ్‌దేవ్, ఉపాధ్యక్షులు అంకుష్, సత్యనారాయణ, ముఖ్య సలహాదారు డోంగ్రే రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు సాగర్, రేగాల నవీన్, ఉప ప్రధాన కార్యదర్శి ఇప్పలపల్లి చక్రధర్, వివిధ శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మంచిర్యాల తొలి డీఈఓ రవికాంతరావుకు ఘన సన్మానం

### - విద్యాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడిన పర్యావరణవేత్త యోగేశ్వర్

**నస్పూర్, మే 5, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా తొలి విద్యాశాఖ అధికారి, రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ (ఎస్ఐఈటీ) ప్రొఫెసర్ కె. రవికాంతరావు విద్యా రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ పేర్కొన్నారు. రవికాంతరావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వయోజన విద్యా కార్యాలయానికి వచ్చిన ఆయనను యోగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పుష్పమాల, శాలువా, సన్మానపత్రంతో ఘనంగా సత్కరించి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. మంచిర్యాల జిల్లా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో రవికాంతరావు విశిష్టమైన పాత్ర పోషించారని యోగేశ్వర్ తెలిపారు. ఆయన అందించిన ప్రోత్సాహం జీవితంలో మరువలేనిదని చెప్పారు. జిల్లాలోని విద్యా సంస్థల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇరువురి మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని వివరిస్తూ ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. పర్యావరణ రక్షణ కోసం యోగేశ్వర్ నిరంతరంగా చేస్తున్న సేవలను రవికాంతరావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రకృతి మిత్ర సంస్థ ద్వారా రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**✳ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**లక్షెట్టిపేట, మే 05, ప్రభాతవార్త**

కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మిట్టపల్లిలో గల శ్రీరామ రైస్ మిల్, శివరామకృష్ణ రైస్ మిల్, గుల్లకోటలో గల శ్రీ రామచంద్ర రైస్ మిల్‌లను జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి రైస్ మిల్లుల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. జన్నారం మండలంలోని పొన్కల్, రెండ్లగూడ, మొర్రిగూడ, దండేపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు నిబంధనల ప్రకారం తాలు, తప్పు, తేమ లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎఫ్ ఏ క్యూ నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస వసతి సౌకర్యాలు త్రాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, హస్క్ రిమూవర్స్, ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జన్నారంలో గల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ గోదామును పరిశీలించి మండల కేంద్రంలో గల రాఘవేంద్ర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పశుగ్రాసాన్ని సేకరించి నిలువ చేస్తున్న యువకులు

## గోమాతలకు స్వచ్ఛందంగా పశుగ్రాస సేకరణ

**సారంగాపూర్, మే 05, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామ సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న సుమారు 70 ఆవులకు పశుగ్రాసం కొరత ఏర్పడటంతో గ్రామ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆవులకు మేత అందడం లేదని గుర్తించిన యువకులు మొక్కజొన్న పొట్టును సేకరించి నిలువ చేశారు. గోమాతలను కాపాడుకోవడం కోసం దాతలు, చుట్టుపక్కల గ్రామస్తులు స్పందించి తమకు తోచిన పశుగ్రాసాన్ని అందించాలని యువకులు కోరారు. ఎవరైనా మేత ఇస్తామని ముందుకొస్తే, తామే స్వయంగా వెళ్లి తీసుకువచ్చి వర్షాకాలానికి సరిపడా నిలువ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సుప్రియ

## మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం: ఎస్సై సుప్రియ

**భైంసా, మే 05, ప్రభాతవార్త:**

గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని రూరల్ ఎస్సై సుప్రియ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దేగాం గ్రామంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేగాం గ్రామాన్ని మాదక ద్రవ్యాల రహిత గ్రామంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. యువతను సరైన దారిలో నడిపేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు.

## నూతన కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ

**సారంగాపూర్, మే 05, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రాను జిల్లా దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాక్ పెళ్లి సురేందర్ ఆధ్వర్యంలో జిల్లాలో దివ్యాంగులకు సంఘ భవనం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని, మంజూరైన స్కూటీలను త్వరగా పంపిణీ చేయాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల నాయకులు ఇసక్ అలీ, సట్టి సాయన్న, ముత్యం, భగవాన్, సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న యువనేత బాజీరావు

## మొక్కజొన్న కొనుగోలులో జాప్యం తగదు: యువనేత బాజీరావు

**భైంసా, మే 05, ప్రభాతవార్త:**

మొక్కజొన్న కొనుగోలులో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదని ముధోల్ నియోజకవర్గ యువనేత బాజీరావు విమర్శించారు. మంగళవారం లోకేశ్వరం మండలంలోని పుస్పూర్, కాండ్లి, నగర్ తండా గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు సమస్యలపై ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. వెంటనే గన్ని బ్యాగులు, రవాణా, గోదాముల సౌకర్యాలు కల్పించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కనీస ఏర్పాట్లు లేకుండా కొనుగోలు కేంద్రాలను ఎలా ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటాం: ఎస్పీ జానకి షర్మిల

**భైంసా, మే 05, ప్రభాతవార్త:**




జిల్లా ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటామని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు భైంసా క్యాంప్ కార్యాలయంలో జిల్లా ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దేగాంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భైంసా, మే 05, ప్రభాతవార్త:**

మండలంలోని దేగాం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి ప్రారంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. ఐకేపీ సిబ్బంది రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏ గ్రేడ్ రకానికి 2389 రూపాయలు, బి గ్రేడ్ రకానికి 2369 రూపాయల ధర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్

**సారంగాపూర్, మే 05, ప్రభాతవార్త:**

మండలంలోని దని గ్రామంలో పలు వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైతులు ఇబ్బంది పడకుండా మండలంలో 11 వరి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని సకాలంలో అమ్ముకోవాలని, దళారుల దగ్గరకు వెళ్లి మోసపోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బడి పోతన్న, నాయకులు భూమారెడ్డి, మిర్థ సాయన్న, మల్లేష్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, రైతులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది

# నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు చేయాలి

## ★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల బ్యూరో, మే 5, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం పొలంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టంలో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఉద్యానవన అధికారిణి కందుల సహజ

# ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలి

## - ఉద్యానవన అధికారిణి కందుల సహజ

**లక్షెట్టిపేట, మే 05, ప్రభాతవార్త**

ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని ఉద్యానవన అధికారిని కందుల సహజ అన్నారు. మంగళవారం రోజు లక్షెట్టిపేట పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో మూడు మండలాల రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రైతులు పంటల మార్పిడి విధానాన్ని అనుసరించి ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు. సంవత్సరం అంతా ఆయిల్ ఫామ్ తోటలతో లాభం ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే శక్తి ఆయుష్మాన్ తోటలకు ఉందన్నారు. ఆయిల్ ఫామ్ గెలలను నేరుగా కంపెనీలే కొనుగోలు చేస్తాయని దీంతో మధ్యవర్తుల బెడద ఉండదన్నారు. ఆయిల్ ఫామ్ మద్దతు ధరలను ప్రభుత్వం నెలకోసారి ప్రకటిస్తాయని దీంతో రైతులకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు సాంప్రదాయ పంటల నుంచి మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# అసెంబ్లీలో ప్రస్తావన వల్లే రైతులకు నష్టపరిహారం: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మే 05, ప్రభాతవార్త**

మండలంలోని రాజురా గ్రామంలో 2012లో నిర్మించిన చెరువు వల్ల భూమి కోల్పోయిన రైతులకు రెండవ విడత భూ నష్టపరిహారాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని తాను ప్రస్తావించడం వల్లే నేడు రైతులకు 18 లక్షల 1 కోటి రూపాయల పరిహారం మంజూరైందని తెలిపారు. 2014లో అప్పటి ప్రభుత్వం మొదటి విడతగా 50 శాతం నిధులు విడుదల చేయగా, మిగిలిన మొత్తాన్ని ఇప్పుడు అందించడం జరిగిందన్నారు. పరిహారం అందడంతో స్థానిక రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మోడుబారుతున్న తాటి వనాలు..

## - ఆస్నాద్‌లో వింత వ్యాధితో చనిపోతున్న తాటి చెట్లు
## - ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు
## - రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు వేడుకోలు

**చెన్నూరు, మే 5, ప్రభాతవార్త**

కులవృత్తిని నమ్ముకుని బ్రతికే గీత కార్మికులు కూలి పనులు చేసుకుని బ్రతికే పరిస్థితి తలెత్తుతాయేమోనని గౌడన్నలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామంలో వింత వ్యాధితో తాటి చెట్లు చనిపోతున్నాయి. ఇప్పటివరకు తాటి వనంలో సగానికి పైగా చెట్లు చనిపోవడంతో కులవృత్తిని నమ్ముకొని బ్రతికే మాకు చెట్లు చనిపోవడంతో ఉపాధి కోల్పోతున్నామని బాధపడుతున్నారు. తాటి చెట్లు ఎందుకు చనిపోతున్నాయో సంబంధిత అధికారులు పరీక్షించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టి కులవృత్తిని నమ్ముకుని బ్రతికే మాకు, తగు న్యాయం జరిగేలా చూడాలని, అధికారులను వేడుకుంటున్నామని వారు పేర్కొన్నారు.

### మా దృష్టికి రాలేదు. చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరి

ఈ విషయంపై చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరిని వార్త ప్రతినిధి సంప్రదించగా ఇప్పటివరకు నాకు తాటి చెట్లు చనిపోతున్నాయన్న విషయం నా దృష్టికి రాలేదని, కుల పెద్దలు కూడా ఇప్పటివరకు చెప్పలేదని తెలిపారు. రెండు రోజుల్లో హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు రక్షణ చర్యలు చేపడతామని అన్నారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లును తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**జన్నారం, మే 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వదల రాములు మంగళవారం జన్నారం మండలంలో పర్యటించారు. మార్కెట్ యార్డ్ పోనకల్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం సేకరణ, తేమ శాతం పరిశీలన, టోకెన్ల జారీ, గన్నీ బ్యాగుల లభ్యతపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిర్దేశిత ప్రమాణాల మేరకు తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అనంతరం మొర్రిగూడలోని శ్రీ రాఘవేంద్ర రైస్ మిల్లును కూడా అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, సీఎంఆర్ డెలివరీ వివరాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, డిటి గంగరాజా తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో
# రైతు ఆత్మహత్య

## - నిందితుడి అరెస్ట్

**సారంగాపూర్, మే 05, ప్రభాతవార్త:**



వరి కోతలకు హార్వెస్టర్ రాకుండా అడ్డుపడటంతో మనస్థాపం చెందిన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన గజ్జ శ్రీధర్ (37) పొలం కోయడానికి అదే గ్రామానికి చెందిన దేశెట్టి గంగయ్య (50) హార్వెస్టర్ రాకుండా అడ్డుకున్నాడు. గంగయ్య తనను మానసికంగా వేధిస్తున్నాడనే బాధతో శ్రీధర్ ఏప్రిల్ 29న నిర్మల్ కలెక్టరేట్ వద్ద పురుగుల మందు తాగాడు. నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ప్రేమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శ్రీధర్ మృతికి కారకుడైన దేశెట్టి గంగయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# కలమడుగులో కన్నుల పండుగగా శ్రీరామ యజ్ఞం

**జన్నారం, మే 5, ప్రభాతవార్త**



మండలంలోని కలమడుగు గ్రామంలో వెలసిన శ్రీ నర నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం కన్నుల పండుగగా రామ యజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ పూజారి రాజా నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో తొలుత ఆంజనేయస్వామికి నానా రీతుల అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల రామ నామ స్మరణ, జై శ్రీరామ్ నినాదాల మధ్య శ్రీరామ యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. 103 మంది ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి యజ్ఞంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. యజ్ఞం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతల నాగమణి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్, గ్రామ పెద్దలు బొంతల మల్లేష్, గౌరయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మనుగడకు భూగర్భ గనుల ఉత్పత్తి కీలకం

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - ఆర్.కె 7 గనిలో ఉత్పత్తి లక్ష్యాలపై క్షేత్రస్థాయి సమీక్ష**

**నస్పూర్, మే 5, ప్రభాతవార్త**

సంస్థ మనుగడ నిర్దేశిత లక్ష్యాల సాధనపైనే ఆధారపడి ఉందని, భూగర్భ గనులు ఓపెన్ కాస్ట్ గనులకు ధీటుగా రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్.కె 7 భూగర్భ గనిలో అధికారులు, సేఫ్టీ కమిటీ, మైనింగ్ సిబ్బందితో నిర్వహించిన క్షేత్రస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేసి ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సమావేశంలో భాగంగా డీజీఎం రాజన్న గత ఆర్థిక సంవత్సరపు ఉత్పత్తి వివరాలు, యంత్రాల వినియోగం, ఎదురైన లోటుపాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



ఆర్.కె 7 గనిలో ఉత్పత్తి ప్రణాళికలపై సమీక్షిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

గత ఏడాది ఆర్.కె 7 గని స్వల్ప తేడాతో లక్ష్యానికి దూరమైన విషయాన్ని జీఎం గుర్తు చేస్తూ, ఈసారి నూటికి నూరు శాతం ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. గనిలో డ్రిల్స్ సంఖ్యను పెంచడంతో పాటు ఎస్‌డీఎల్ యంత్రాల ద్వారా బొగ్గు వెలికితీత శాతాన్ని మెరుగుపరచాలని ప్రణాళికలు రూపొందించారు. మ్యాన్ పవర్ పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రక్షణ సూత్రాలను విస్మరించకుండా నాణ్యమైన బొగ్గును వెలికితీయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, గని మేనేజర్ తిరుపతి, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ సెక్రటరీ సారయ్య, గని సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మురళి కుటుంబ సభ్యులు

## ఒమన్‌లో దిలావర్పూర్ వాసి అదృశ్యం

**దిలావర్పూర్, మే 05, ప్రభాతవార్త:**

ఉపాధి కోసం ఒమన్ వెళ్లిన మండల కేంద్రానికి చెందిన ఆసం మురళి (43) అక్కడ అదృశ్యం కావడం కుటుంబ సభ్యుల్లో ఆందోళన నింపింది. గత నెలలో ఒమన్ వెళ్లిన మురళి, లేబర్ క్యాంప్‌లో పని చేస్తూ మెడికల్ పరీక్షల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని తోటి కార్మికులు తెలపడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మంగళవారం తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన స్వదేశ్ వెంటనే ఈమైగ్రేట్ పోర్టల్ ద్వారా ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయానికి, ఢిల్లీలోని అధికారులకు సమాచారం అందించారు. ఇండియన్ సోషల్ క్లబ్ ప్రతినిధులతో మాట్లాడి మురళి ఆచూకీ కోసం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం మురళి కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి

**నిర్మల్, మే 05, ప్రభాతవార్త**



అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన బిజ్జారపు శేషగిరిరాజు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ. 2 లక్షల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించి, మంగళవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తామన్నారు. సకాలంలో ఆర్థిక సాయం అందించినందుకు బాధితుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**జన్నారం, మే 5, ప్రభాతవార్త**

రైతుల సౌకర్యార్థం జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభంతో ఈ ప్రాంత రైతులు తమ పంటను అమ్ముకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తామని, తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## మానవ హక్కులపై షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు ఆహ్వానం

**ఆసిఫాబాద్, మే 5, ప్రభాతవార్త :**

జిల్లా వ్యాప్తంగా మానవ హక్కులపై షార్ట్ ఫిల్మ్ పోటీలలో పాల్గొనడానికి ఆసక్తి గల వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ హరిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆద్వర్యంలో 2026 సంవత్సరానికి గాను షార్ట్ ఫిల్మ్ పోటిలకు దేశ పౌరుల నుండి ఆన్ లైన్ ద్వారా ఎంట్రిలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వయస్సుతో సంబంధం లేదని, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవవచ్చాన్నారు. పోటిలలో వేజేతలకు ప్రధమ బహుమతి 2 లక్షలు, ద్వితీయ బహుమతి లక్ష యాభై వేలు, తృతీయ బహుమతి లక్ష రూపాయలు వుందని తెలిపారు. ఆసక్తి కలవారు జూన్ 30 లోపు తమ ఎంట్రిలను గూగుల్ డ్రైవ్ ద్వారా సంబంధిత మేయిల్‌కు పంపించాలని కలెక్టర్ తెలిపారు.



## నస్పూర్‌లో ఘనంగా శ్రీరామ సహిత హనుమత్ మహా యజ్ఞం

**- అభయాంజనేయ స్వామి ఆలయంలో లోక కల్యాణం కోసం ప్రత్యేక పూజలు**

**నస్పూర్, మే 5, ప్రభాతవార్త**

నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామ సహిత హనుమత్ మహా యజ్ఞం నిర్వహించారు. హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం ఈ యజ్ఞం జరిగింది. శ్రీరామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. యజ్ఞం నిర్వహించిన ఆలయ అర్చకులు ఫణి కుమార్ శర్మ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ స్వాములు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. యజ్ఞం పూర్తయిన తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ నిర్వహణలో భాగస్వాములయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్లు అగ్గు సాగర్, రాచకొండ గోపాలరావు, తోట రజిత, మర్రి శ్రీలత, అగల్ డూటీ రాణి, బొడ్డు స్వప్న తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న సర్పంచ్ పోషన్న

## పోతేపల్లిలో వైద్యశిబిరం

**పెంచికల్‌పేట్, మే 5, ప్రభాతవార్త :**

మండలంలోని పోతేపల్లి గ్రామంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దుర్గం పోషన్న మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు క్యాంపును సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొత్తం 89 మందికి చెస్ట్ ఎక్సరే పరీక్షలు నిర్వహించినట్లు రెడీయోగ్రాఫి టెక్నీషియన్ వరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నన్న, వార్డు సభ్యులు వెంకటాచలం, వైద్య సిబ్బంది శ్రీలత, ఖాదర్ పాషా,సుచరిత, చంద్రకళ, జయ, సువర్ణ, లక్ష్మి కార్యదర్శి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణలో సిబ్బంది నిరంతరం కృషి చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్, మే 5, ప్రభాతవార్త :**

అడవుల సంరక్షణలో సిబ్బంది నిరంతరం కృషి చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణి సూచించారు. జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు యోగేష్ కులకర్ణి ఆధ్వర్యంలో మంగళవారం డిఎఫ్ఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ మాట్లాడుతూ అడవుల సంరక్షణలో సిబ్బంది కార్యోన్ముఖులు కావాలని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సిబ్బందికి అన్నివేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సద్దాం హుస్సేన్, సాయి చరణ్, స్వప్న, అనిల్ పాల్గొన్నారు.



జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణికి మొక్కను అందిస్తున్న సిబ్బంది